# పేరులోనే వుంది

– వేదుల చిన్న వేంకట చయనులు

చూపులు కలిసేయి. ఎంత బాగుందో అని అనుకున్నాడు. చక్కగా ఉన్నాడు అనుకుంది ఆ అమ్మాయి. మాయదారి మన్మథుడికి మరి పనిలేదు. పూల ధనుస్సు పట్టుకుని తిరుగుతూ మంచివాళ్లైనా లెక్కచేయకుండా వారిపై బాణాలు వదిలేస్తూండడమే అతగాడి పని.

ఐస్‌క్రీమ్ కప్పులతో,
నీడలో బెంచీ
మీద

కూర్చున్నాక,
ధైర్యం చేసుకుని ''మీదీ ఊరు కాదనుకుంటాను'' అని ఆమెతో మాటలు కలిపే ప్రయత్నం చేసేడు నవ్వుతూ.

''కాదండి. భలే తెలివైనవారులా ఉన్నారు. ఎలా కనిపెట్టారు?'' అంది ఆమె.

ఎంత చక్కని పలువరుస అని మనసులోనే మెచ్చుకుంటూ. (కొంచెం చిన్నవిగా, ఎలుక పళ్లులా వున్నా ఆ పూలబాణ మహిమలో అలా అనిపించలేదు).

''ఇందులో తెలివితేటలేమున్నాయి? అసలు అవి ఎక్కడున్నాయా అని కనిపెట్టడానికి మా లెక్కలు మేస్టారు పాపం చాలా పరిశ్రమ చేశారు. చివరికి లాభంలేదని హిస్టరీ చదువుకోరా నాన్నా అని.''

''హిస్టరీకి తెలివితేటలు అవసరం లేదని ఎలా అనుకున్నారతను?'' అని ఆమె కొంచెం ఆవేశంగా అడిగితే అమ్మయ్యో ఈవిడ హిస్టరీలో పై చదువు వెలిగిస్తోన్న మహిళ కాబోలు అని.

''ఆహాహా... అది ఆ దద్దమ్మ అభిప్రాయం. లెక్కలు రాకపోయినా చెల్లుతుందిగానీ చరిత్ర తెలియనివాడు ఒక సారి పడ్డ గోతిలోనే మళ్ళీ పడతాడు కదండీ. ఇంతకీ చెప్పొచ్చేదేమంటే మీతో కూర్చుని ఐస్‌క్రీమ్ తినగలిగిన ఈ మందబుద్ధికి పనేముందండీ? ఊరంతా గాలించి బలాదూర్‌గా తిరగడమేకదా? అలా తిరుగుతూ తిరుగుతూ కాళ్లు నలిగిపోయినందుకు కనీసం ఈ ఊళ్లోని అమ్మాయిలని తెలియకుండా ఉండడం అసంభవమంటారా కాదా? చూసేను. మంచి వయ్యారి తిప్పులాడిలని. ఏం లాభం? నోరు విప్పితే పుచ్చిపళ్ళో, అడుగువేస్తే సొట్ట కాలో, గొంతుక విప్పితే గార్దభ స్వరమో! కానీ మీలా అన్ని విధాలా ఇంత అందంగా వుండి అంత చక్కని పలువరుస గల అమ్మాయిని ఎన్నడూ చూడలేదు. అంటే మరి మీది పై ఊరు అన్నమాటేకదా?''

''చాలా చమత్కారంగా మాట్లాడుతారండీ. మా నాన్న గారికి బదిలీ అయి ఇక్కడికి వస్తే కాలేజీ సెలవులని ఇలా రావడమూ, మీతో కలియడమూ జరిగింది. ఇంతకీ మీ పేరు?''

జీవితంలో అనేకసార్లు ఆత్మహత్య చేసుకుంటేనే నయం, ఈ బాధ జీవితాంతం అనుభవించే కంటే అని అనుకున్నాడు. ఆ బాధే మళ్లీ ఎదురయింది. జ్ఞానమెచ్చి స్కూలులో చేరేవరకూ 'బోడిగా, బోడిగా' అని అమ్మానాన్న పిలిచినప్పుడు, గెంతులువేసి వారి ఒడిలో దూకేవాడు. స్కూలులో పేరు వేరుగా వేసినప్పుడు నా పేరు ఎందుకు మార్చేసేరని కంగారు పడిపోయాడు.



''ఎందరో పుట్టి నాలుగో ఏడు రాకుండానే చచ్చిపోయారు బాబూ. అందుకని స్కూలులో వేసే దాకా పేరు పెట్టకుండా ఊరుకుందాం అని నిర్ణయించుకున్నాం. వెటకారంగా ఆ పేరున పిలిచినా మాకు దక్కుతావేమో అనే మూఢనమ్మకంతో అలా పిలిచేవారం. ఇవాళ్టినుంచి నీ అసలు పేరుతో పిలుచుకుని ఆనందిస్తాం బాబూ'' అని చెప్పి ఆనందబాష్పాలు విదిల్చింది అమ్మ అచ్చమ్మ.

''మరైతే పూర్తి పేరుతో కాకుండా ఇలా ఎందుకు?''

''ముందువన్నీ మొక్కుబడి పేర్లు బాబూ. ఆ దేముళ్లందరికీ మొక్కుకున్నాము కనుకనే నువ్వు దక్కేవు నాయనా'' అన్నాడు తండ్రి వీరయ్య.

పేరుతో మహా చిక్కయిపోయింది. స్కూలులో మేస్టారు ఎటెండెన్స్ తీసుకుంటూ పేరు పలికినప్పుడు పిల్లలంతా ఒకటే కిలకిల. దానికితోడు మేష్టారు కూడా వాళ్లని సైలెన్స్ అంటూ నోరుతో మందలిస్తూ బుంగమూతితో నవ్వేసేరు. ఏడుస్తూ ఇంటికి వచ్చి–

''నా పేరు మార్చేయండి. అందరూ నవ్వుతున్నారు'' అని ఏడుస్తుంటే–

''చూడు బాబూ! వాళ్లంతా నాలుగు రోజులు నవ్వుతారు. ఆ మీదట నీతో నేస్తంకట్టి నీ పేరు చక్కగా పిలుస్తారు'' అని వీరయ్య కొడుకుకి చెప్పగానే అర్థమయిపోయింది. కస్తూరి వరాహ వీర వేంకట సత్యసూర్య పిచ్చయ్యగా స్కూలులో నామకరణమయిన తనకు పిచ్చయ్య నామమే లోకంలో మిగిలిపోతుందని.

ఎప్పుడో ఒకప్పుడు చెప్పాలికదా. మళ్లీ కలుసుకుని నేస్తం కట్టాలంటే అని ఒక నిర్ణయానికి వచ్చి పెద్ద నిట్టూర్పు వదిలి–

''కస్తూరి వరాహ వీర వేంకట సత్య సూర్య పిచ్చయ్య. ఉరఫ్ పిచ్చయ్య'' అని చెప్పేశాడు.

ఆపుకోలేక ఆమెకు కళ్లంట నీళ్లు వచ్చేయి. సూర్యాస్తమయం కాగానే ముడుచుకుపోయిన మందార మొగ్గ ముఖంపెట్టి లేచి వెళ్లిపోబోయాడు. అప్పుడా అమ్మాయి–

''సారీ మీరు అపార్థం చేసుకున్నట్లున్నారు. నా మాట కాస్త వింటే'' అన్న ఆ పలుకులు శ్రవణానందమయి పిచ్చయ్యని అక్కడే నిలపెట్టేసాయి.

ఆ అమ్మాయి మళ్లీ–

''రక్షించి నా మాట వినేందుకు వెనుతిరిగారు థాంక్స్. నా పేరు వింటే మీరింకా నవ్విపోతారన్న ఆలోచన వచ్చి అలా నవ్వేసాను. నేను మా తల్లిదండ్రులకి మీ అంత అపురూపమైన బిడ్డను కాదుకానీ...''

''మీరపురూపం కానివారన్నవారిని నా దగ్గరకు రమ్మనండి. ఒక్కటిడ్చి పుచ్చుకుని...''

''ఎవరూ కాదు నేనే అన్నా కనుక''

''అమ్మమ్మ చంపేసేరు. చెప్పండి మీ పేరు? అది విని నవ్విపోయేవారు వాళ్ల తాతల దగ్గరకు వెళ్లేలా చావగొట్టే పూచీ నాది.''

''నా పేరు పేమ'' అంది ఆమె.

''మీరు నాతో ఆసికాలాడుతున్నారు. పేమ! ప్రేమకి వికృతి ఏదో అంటారు. అదా?''

''కాదు. పెయ్యమ్మకి నాజూకు రూపం'' అని ఆ అమ్మాయి అన్నదో లేదో పిచ్చయ్య విరగబడి నవ్వాడు. పిచ్చయ్య నవ్వుతుంటే పెయ్యమ్మ కూడా ఆపుకోలేక పడీ పడీ నవ్వసాగింది. నెమ్మదిగా నవ్వులు ఆపుకున్నాక పిచ్చయ్య–

''గులాబీ పూవుని ఏ పేరున పిలిచినా దాని పరిమళం తగ్గుతుందా? పేరులో ఏముంది అన్నాడుట ఎవరో ఇంగ్లీషు కవి. అలా మన పేర్లేమైనాసరే మనకి మనమేగాని మరొకరం ఎలా అవుతాము? పేరులో ఏముందండీ?'' అన్నాడు నవ్వుతూ.

పెయ్యమ్మ ''పేరులోనే వుంది ప్రభావం, ప్రతిభ. మన పేర్లు అందరి పేర్లలా ఉంటే మనమిలా ఒకరినొకరం అర్థం చేసుకుని నేస్తాలయ్యేవాళ్లమేనా?'' అంది.

''ఔను పేరులోనే వుంది'' అని పిచ్చయ్య చేయి కలిపితే పెయ్యమ్మ సిగ్గులొలికింది.

★